బంజారాల చరిత్ర ఎంతో గొప్పది

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బంజారా చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రచయితలు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 3: బంజారా గిరిజన తెగ ఘనమైన చరిత్రను పుస్తకరూపంలో సమాజానికి అందించడం అభినందనీయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ సూర్యాధనుంజయ్, మాజీ సీటీవో డాక్టర్ ధనుంజయ్ నాయక్ సంయుక్తంగా రచించిన 'బంజారా చరిత్ర' పుస్తకాన్ని ముఖ్యమంత్రి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రచయితలు మొదటి ప్రతిని రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బంజారాల చరిత్ర ఎంతో గొప్పదన్నారు. బంజారాల చరిత్రను గ్రంథస్తం చేసేందుకు విశేష కృషి చేసిన రచయితలను అభినందించారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, శాఖ అదనపు కమిషనర్ కురాకుల జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి తదితరులు

- సుల్తాన్‌బజార్, జనవరి 3

కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో వీసీ, ప్రొఫెసర్ ఎం. విజ్జులత అధ్యక్షతన బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరామ్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ విజ్జులతతో పాటు కలిసి సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వ విద్యాలయం తొలి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్రా హాల్‌లో నిర్వహించిన సదస్సులో రాష్ట్రంలో విశ్వ విద్యాలయాల ప్రస్తుత పరిస్థితి అనే అంశంపై వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

- సుల్తాన్‌బజార్, జనవరి 3

జువైనల్ హోంను సందర్శించిన జిల్లా జడ్జిలు

సైదాబాద్, జనవరి 3 : జిల్లా జడ్జిలుగా ఎంపికైన 12 మంది ట్రైనీలు బుధవారం సైదాబాద్ బాలుర సదనాలను సందర్శించి, స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా చిన్నారుల జీవన స్థితిగతులను, విద్య, వైద్యం, ఆహారం, వసతి వంటి అనేక అంశాలను పరిశీలించారు. బాలుర సదనాల్లో చిన్నారులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని, టీం వర్క్‌గా పనిచేస్తున్నారని.. చిన్నారుల సంరక్షణ చర్యలను వారు ప్రశంసించారు.

'రిలయన్స్ ట్రెండ్స్'కు జరిమానా..

నాంపల్లి కోర్టులు, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : రిలయన్స్ ట్రెండ్స్‌లో వినియోగదారులకు క్యారీబ్యాగ్‌లపై రూ.7 చార్జీ వేయడంపై వినియోగదారుల ఫోరం చర్యలు తీసుకుంది. వినియోగదారులపై ఒత్తిడి తెచ్చినట్లైతే రూ.3వేలను జరిమానాగా చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు వెల్లడించింది. ఇటీవల ఢిల్లీ కమిషన్ సభ్యులు మల్హోత్రా, రెమ్మీబన్సాల్, రవికుమార్ సమక్షంలో ఫిర్యాదు దారుడిచ్చిన ఫిర్యాదుపై ఆదేశాలను జారీ చేశారు. బలవంతంగా క్యారీబ్యాగులకు రూ.7 కలిపి బిల్లు వేయడం పట్ల ఇచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకుంది. ఈ మేరకు పై విధంగా చర్యలు తీసుకుంది.

హాస్యనటుడు బ్రహ్మానందానికి

జీవిత సాఫల్య పురస్కారం

హాస్యనటుడు బ్రహ్మానందానికి జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, మురళీమోహన్

రవీంద్రభారతి, జనవరి 3 : ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగా సప్తస్వరం 35వ వార్షికోత్సవం సందర్భంగా హాస్యనటుడు బ్రహ్మానందానికి జీవితసాఫల్య పురస్కారం, స్వర్ణకంకణ ప్రదానోత్సవం రవీంద్రభారతిలోని మెయిన్‌హాలులో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నటుడు మురళీమోహన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం హాస్యనటుడు బ్రహ్మానందానికి జీవిత సాఫల్య పురస్కారంతో పాటు స్వర్ణకంకణాన్ని మంత్రి ప్రదానం చేశారు.

జాడలేని కరోనా సమాచారం

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): చాపకింద నీరులా పెరుగుతున్న కరోనా జెఎన్.1 వేరియంట్ కేసులతో యావత్ దేశం మొత్తం అప్రమత్తంగా ఉన్న తరుణంలో తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారం పది రోజుల నుంచి కరోనా సమాచారాన్ని ప్రజలకు వెల్లడించకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మొన్నటి వరకు అందిన అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా చూస్తే రాజధాని నగరంలోనే 80నుంచి 90శాతం కేసులు నమోదైన విషయం తెలిసిందే.

సివిల్స్ ఇంటర్వ్యూలకు భయపడొద్దు..

సిటీబ్యూరో: సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలను ధైర్యంగా ఎదుర్కోవాలని, భయపడవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈ మేరకు బుధవారం బంజారాహిల్స్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలకు హాజరుకానున్న అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. కాగా, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2023లో ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టింగ్, డెత్) జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయడంపై షిఫ్టింగ్, హాజరుకాని ఓటర్లను కనుగొనడంపై జిల్లా కలెక్టర్ (జిల్లా ఉప ఎన్నికల అధికారి) అనుదీప్ దురిశెట్టి దృష్టి పెట్టారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ, పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటి నంబర్ల జాబితాను తయారు చేయడం వంటి అంశాలపై బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.జానారెడ్డిని ఉమ్మడి రాష్ట్ర సమాచార మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐదేండ్లలో సుపరిపాలన దిశగా అమలు చేయాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

- సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ)

ఎస్‌సీఆర్‌కు 1120 ఫాగ్ పాస్ పరికరాలు

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రతి ఏడాది శీతాకాలంలో పొగమంచు వాతావరణంలో రైళ్ల రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ సమస్య తొలిగించి రైళ్లు సాఫీగా సాగడం కోసం భారతీయ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా అన్ని జోన్లకు కలిపి మొత్తం 19,742 ఫాగ్ పాస్ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో దక్షిణ మధ్య రైల్వే జోన్ కోసం 1120 ఫాగ్ పాస్ పరికరాలను అందించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

– కాగా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని కాచిగూడ–మహబూబ్‌నగర్–కృష్ణ సెక్షన్లలో బుధవారం రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆయనతో పాటు హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి: సీతక్క

రవీంద్రభారతి, జనవరి 3: ఏ దేశంలోనైతే మహిళలు గౌరవించబడుతారో ఆ దేశం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు. సావిత్రిబాయిపూలే 193వ జయంతి ఉత్సవాలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మణిమంజరి సాగర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... సావిత్రిబాయిపూలే స్త్రీల విజ్ఞానం కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప సామాజిక యోధురాలని కొనియాడారు. చదువుల తల్లి సావిత్రిబాయిపూలే అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అని, ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఎంతో మందికి విజ్ఞానాన్ని అందించిన దివ్యజ్యోతి అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం కొనియాడారు. అంతకు ముందు పలువురు సామాజిక ఉద్యమకారులకు సావిత్రిబాయిపూలే అవార్డులతోపాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ విక్రంగౌడ్, మణిమంజరి సాగర్, చిన్న శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, జాజుల శ్రీనివాస్‌గౌడ్

సావిత్రిబాయి పూలే నాకు ఆదర్శం

మంత్రినైనా చదువు కొనసాగిస్తున్నా: మంత్రి సీతక్క

ఖైరతాబాద్, జనవరి 3 : భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను తాను ఆదర్శంగా తీసుకున్నానని మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా కోట్లాది మంది మహిళలు విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారంటే..అందుకు సావిత్రిబాయి పూలే ఆదర్శమన్నారు. తన జీవితంలోనూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తి నింపిందని, ఉద్యమాల నుంచి బయటకు వచ్చిన తర్వాత చదువును ఎంచుకున్నానని తెలిపారు. ఎంఏ, ఎల్ఎల్‌బీ, పీహెచ్‌డీ చదివానని, ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ఎం చేస్తున్నానని చెప్పారు. సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అలాగే జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయురాళ్లు, రచయితలు, వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలుగా సేవలందిస్తున్న మహిళలను సత్కరించారు. భారతీయ ఓబీసీ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కె.కోటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, సీనియర్ పాత్రికేయులు వెంకటేశ్వర్లు, సమాఖ్య తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ సాయి రమ్య, అంబు రాథోడ్, శ్రవణ్ కుమార్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి సేవలు ఎనలేనివి

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): స్త్రీల అక్షరాస్యత కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు ఎనలేనవని తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాస్ ఇంజినీర్స్ ఫెడరేషన్ (టీబీసీఈఎఫ్) కొనియాడింది. సావిత్రిబాయి జయంతిని లక్డీకాపూల్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫెడరేషన్ అధ్యక్షుడు దేవల సమ్మయ్య అధ్యక్షత వహించగా, కార్యదర్శి సతీశ్ కొట్టే, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ తిరుమలి, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ సుదర్శన్, ప్రొఫెసర్ ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.